క్లుప్తంగా

సిలిండర్ పక్కదారి పడుతోందా ?


ప్రైవేటు వ్యక్తుల కోసం చిన్న ఆటోలో సిలిండర్లను తరలిస్తున్న సిబ్బంది

సాక్షి టాస్క్‌ఫోర్స్ తిరుపతి: ఎస్వీయూ కోఆపరేటివ్ స్టోర్స్‌కి అనుసంధానంగా ఉన్న ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలో అక్రమాలు మొదలయ్యాయి. గ్యాస్ సిలిండర్లను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం ఎల్పీజీ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బంది అధికారులతో కుమ్మక్కై ప్రైవేటు వ్యక్తులకు అధిక మొత్తానికి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కోఆపరేటివ్ స్టోర్ సభ్యులు ఈ విషయాన్ని పసిగట్టి ప్రైవేటు చిన్న ఆటోలో సిలిండర్లను తరలిస్తున్న దృశ్యాలను మీడియాకు పంపి ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులు కావస్తున్నా తమకు సిలిండర్ అందలేదని.. ఇలా ప్రైవేటు వ్యక్తులకు అందించడం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్టేట్, విజిలెన్స్ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేసి తమకు సకాలంలో గ్యాస్ సిలిండర్లను అందించాలని కోరుతున్నారు.

'సిద్ధార్థ'లో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి వద్ద ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ప్రముఖ కోర్ కంపెనీ షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ వారు ఫైనలియర్ ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు చేశారు. కంపెనీకి చెందిన హెచ్ఆర్ టీం ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులను వివిధ రకాలుగా పరీక్షించి 21 మందిని ఉద్యోగాలకు అర్హులుగా ఎంపిక చేసి, వారికి నియామక పత్రాలు కూడా అందజేశారు. క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ కొండారెడ్డి, సెక్రటరీ ఆనందరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్‌తో పాటు హెచ్ఓడీలు బాలసుబ్రమణ్యం, భాస్కర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామి అభినందించారు.

కార్మిక సంక్షేమ చట్టం తీసుకురావాలి

తిరుపతి కల్చరల్: హమాలీ కార్మికులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో తిరుపతిలో జరగనున్న హమాలీ యూనియన్ నగర మహాసభలకు సన్నద్ధం కావాలన్నారు. హమాలీ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఎన్‌డీ, రవి, జిల్లా కార్యదర్శి బాబు తదితరుల పాల్గొన్నారు.

తుడా ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

తిరుపతి తుడా: రోడ్లను కాపాడాల్సిన తుడా సంస్థలో పనిచేస్తున్న శ్రీదేవి రోడ్డును ఆక్రమించినందుకు ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కోరారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లో తన ఇంటి ఎదురుగా ఉన్న పది అడుగుల రోడ్డులో ఇరవై రెండున్నర అడుగుల వరకు ఆక్రమించారని ఆరోపించారు. ఆమె ఇంటి ముందు పది అడుగుల రోడ్డు ఉన్నట్టు 1997లో కొనుగోలు చేసిన డాక్యుమెంటులో కూడా ఉందని గుర్తు చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

భాకరాపేట : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని తెలిపారు. గురువారం మండలంలోని జంగావాండ్లపల్లె పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో 7వ పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడా గురించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తల్లులు పిల్లలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని తెలియజేశారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నర్సీస్, ఆశా వర్కర్ హేమావతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గోవిందా.. వాహనాలకు భద్రత లేదా ?

తిరుపతి నగరంలో ఇటీవల అష్టదరిద్రాలు చోటు చేసుకుంటున్నాయి. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తుల భద్రతతో పాటు వారి వాహనాలకు రక్షణ లేకుండా పోతోంది. ఈ మధ్యకాలంలో తిరుపతి బాలాజీ బస్టాండ్‌లో కొందరు తమ వాహనాలను పార్క్ చేసి వెళ్లి.. మళ్లీ వచ్చి చూస్తే.. బైక్‌లో పెట్రోల్ అయినా చోరీ అయి ఉంటుంది.. లేదంటే వాహనమే కనిపించకుండా పోతోంది. ప్రయాణికుల భద్రతను పర్యవేక్షించాల్సిన వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం బాధాకరం.

- తిరుపతి బాలాజీ బస్టాండ్ ప్రాంగణంలో దారుణాలు
- బైక్‌లలో పెట్రోల్ కాజేస్తున్న దొంగలు
- స్కూటర్లు సైతం అపహరణ
- తమ బాధ్యత కాదంటున్న ఆర్టీసీ యాజమాన్యం


శ్రీబాలాజీ బస్టాండ్ ప్రాంగణంలో పార్కింగ్ చేసి బైక్‌లో నుంచి పెట్రోల్ లాగేస్తున్న వైనం

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి.. తిరుమల దర్శనం నిమిత్తం దేశవిదేశాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు. అయితే కొందరు జిల్లావాసులు అలిపిరి శ్రీబాలాజీ బస్టాండ్ వరకు స్కూటర్‌లో వచ్చి.. అక్కడే పార్కింగ్ చేసి ఆర్టీసీ సర్వీసులో తిరుమలకు వెళ్లి దర్శనం చేసుకుని మళ్లీ వస్తుంటారు. అయితే ఈ క్రమంలో శ్రీబాలాజీ బస్టాండ్‌తోపాటు టీటీడీ దర్శన టోకెన్ కౌంటర్ల ప్రాంతంలో వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తారు. దర్శనం చేసుకుని వచ్చి చూస్తే బైక్‌లో పెట్రోల్ మొత్తం మాయమవుతోంది. ఇటీవల తిరుపతికి చెందిన జగదీష్ అనే ప్రయాణికుడు శ్రీబాలాజీ బస్టాండ్‌లో స్కూటర్‌ను పార్క్ చేసి తిరుమలకు వెళ్లాడు. దర్శనానంతరం వచ్చే చూస్తే ఆయన స్కూటర్ చోరీకి గురైంది. అలాగే చాలా మంది తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఏదైనా పని ఉంటే వాహనం బస్టాండ్‌లో పార్కింగ్ చేసి వెళ్తుంటారు. వారి పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికే పెట్రోల్ తీసేస్తున్నారు. దీంతో వాహనదారులు లబోదిబోమంటూ వాపోతున్నారు.

ఎవరు కాజేస్తున్నట్లు ?

నిత్యం రద్దీగా ఉండే తిరుపతి బాలాజీ బస్టాండ్‌తో పాటు టీటీడీ జారీ చేసే దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద పార్కింగ్ చేసే వాహనాల్లో పెట్రోల్ ఎవరు కాజేస్తున్నారనేది అంతు చిక్కట్లేదు. సుదూర ప్రాంతం నుంచి వచ్చిన వారు బస్టాండ్‌లో బైక్‌లను పార్క్ చేయాలంటే భయపడుతున్నారు.

సీరియస్‌గా తీసుకోని అధికారులు..

ఇటు ఆర్టీసీ అధికారులు కానీ అటు టీటీడీ అధికారులు కానీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని పలువురి నుంచి విమర్శలు వస్తున్నాయి. నిఘా కొరవడడంతోనే స్కూటర్ల చోరీలతో పాటు బైక్‌లలో పెట్రోల్ మాయం అవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే తామే బస్టాండ్‌ను అద్దెకు తీసుకున్నామని.. ఈ నేపథ్యంలో తామెక్కడ భద్రత కల్పించగలమని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మరి తమ వాహనాలకు భద్రత ఎలా గోవిందా అని భక్తులు వాపోతున్నారు.

> **మేమే అద్దె బస్టాండ్‌లో ఉన్నాం**
> శ్రీబాలాజీ బస్టాండ్‌ను ఆర్టీసీ అద్దెకు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రత్యేకంగా సెక్యూరిటీని ఏర్పాటు చేయడం ఆర్టీసీకి కుదరదు. ఏదైనా చేస్తే టీటీడీ వాళ్లు చేయాల్సిందే. వాహనదారులు తమ వాహనాలకు సరైన భద్రత ఉన్న ప్రాంతంలో పార్కింగ్ చేసుకుంటే మంచిదని భావిస్తున్నాం.
> **- హరిబాబు, అలిపిరి ఆర్టీసీ డిపో మేనేజర్**

బీసీలకు రాజ్యాధికారం కావాలి


మాట్లాడుతున్న ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: బీసీలకు రాయితీలు కాదని, రాజ్యాధికారం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గ్రామీణ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు 52 శాతం బిల్లును ప్రవేశపెట్టేందుకు కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ఓట్లతో అధికారం చేపట్టిన తెలుగుదేశం తమది బీసీల పార్టీ అని చెప్పడం తప్ప బీసీలకు చేసిందేమీ లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపాలని తాము సూచిస్తే సీఎం చంద్రబాబు చూద్దాం.. చేద్దాం అంటూ కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ గోసంరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ వెంకట శివరాం గౌడ్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్, బీసీ నేతలు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి నివాళి


పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్వమాక్స్ సంస్థ ప్రతినిధులు

చంద్రగిరి: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం స్థానిక స్వమాక్స్ కార్యాలయంలో వేడుకగా నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వమాక్స్ సీఈఓ సంగీతం విశ్వనాథ్ మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే ఆశయాలలో అందరికీ విద్య, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్పవ్యక్తి అన్నారు. నేటి యువకులు, రాజకీయ నాయకులు పూలే అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో స్వమాక్స్ అధ్యక్షురాలు శివకుమారి, కార్యవర్గ సభ్యులు షర్మిల, నారాయణమ్మ, పద్మశ్రీ, జగదీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌పై ఫిర్యాదు


వీసీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఇప్పటివరకు జరిగిన, జరుగుతున్న యూజీ, పీజీ దూరవిద్య పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ రాజ్యమేలిందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు గురువారం వీసీ అప్పారావును కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డీడీఈ పరీక్షలు నిర్వహించిన సెంటర్లలో మాస్‌కాపీయింగ్ జరిగిందని వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించాల్సిన పరీక్షలను నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రాంతాలలో నిర్వహించడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. మాస్ కాపీయింగ్ కోసం ఒక్కో అభ్యర్థి నుంచి వేల రూపాయలు వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హాల్‌టికెట్లలో ఫొటోలు మార్చి బయట వ్యక్తుల చేత పరీక్షలు రాయించిన సంఘటనలు జరగడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వర్సిటీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి కల్చరల్: మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనిస్తూ కుటుంబాలకు దోహదపడాలని డీఎస్పీ శ్రీలత పిలుపునిచ్చారు. ఎంఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు నెలల టైలరింగ్, ఎంబ్రాయిడరీ ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె శ్రీశక్తి యాప్ గురించి వివరించారు. మబ్బు సూర్యనారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలకు స్వయం ఉపాధితో ఎదగాలనే లక్ష్యంగా ట్రస్ట్ ద్వారా స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ సీఈఓ మోహన్‌కుమార్, బీఎస్ రెడ్డి, టైలరింగ్ శిక్షకురాలు తులసి, ఆర్య వర్క్ శిక్షకురాలు ప్రియ, ట్రస్ట్ కోఆర్డినేటర్ రేవంత్, మహిళలు పాల్గొన్నారు.

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'ని ఆదరించండి


మాట్లాడుతున్న హీరో నందమూరి కల్యాణ్‌రామ్

తిరుపతి కల్చరల్: తల్లి సెంటిమెంట్‌తో అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రం ప్రేక్షకుల మనస్సును హత్తుకునేలా ఉంటుందని హీరో నందమూరి కల్యాణ్‌రామ్ తెలిపారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శనార్థం విచ్చేసిన చిత్రం యూనిట్ గురువారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చిత్రాన్ని దర్శకుడు అద్భుతంగా తీర్చిదిద్దారని, తన కెరీర్‌లో ఈ చిత్రం గుర్తిండిపోతుందన్నారు. కర్తవ్యం తర్వాత అంతటి పవర్‌ఫుల్ పాత్రలో విజయశాంతి ఈ చిత్రంలో కనిపిస్తారన్నారు. ఈనెల 18న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో వేంకటేశ్వరుడి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు. దర్శకుడు చిలుకూరి ప్రదీప్, నిర్మాతలు అశోక్‌వర్ధన్, సునీల్‌బాలు, ఎడిటర్ తమ్మిరాజు పాల్గొన్నారు.

శ్రమిస్తేనే పోటీ ప్రపంచంలో ముందుకు..


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి, పోటీ ప్రపంచంలో ముందుకుపోయేందుకు శ్రమించాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల 80వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. అకడమిక్ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ వంటి వాటిపై పట్టు సాధించినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. బీఏలో 92 శాతం, బీకామ్‌లో 93 శాతం, బీఎస్సీలో 90 శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించామన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇలాగైతే వరద పారేదెలా..?


పెరుమాళ్లపల్లి వద్ద అతి పెద్ద కాలువను పూడ్చి రహదారి నిర్మాణం సాగిస్తున్న టీటీడీ ఇంజినీర్లు


పేరూరులో మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంటును పరిశీలిస్తున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి నుంచి శ్రీనివాసమంగాపురానికి చెర్లోపల్లి మీదుగా వెళ్లే రహదారిని టీటీడీ విస్తరిస్తోంది. అయితే అతి పెద్ద సాగునీటి కాలువలను పూడ్చివేయడం సమీప గ్రామాలకు ప్రమాదకరమే అవుతుందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. టీటీడీ వంటి అతి పెద్ద ధార్మిక సంస్థ బాధ్యతారహితంగా రహదారుల విస్తరణ పేరిట కాలువను పూడ్చి వేయడాన్ని రైతులతో పాటు సమీప గ్రామాల ప్రజలు తప్పుబడుతున్నారు. నీటి కాలువలను ధ్వంసం చేయరాదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం పక్కనపెట్టి రహదారి నిర్మాణాలకు పురాతన కాలం నాటి సాగునీటి కాలువను పూడ్చి వేస్తుండడాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి నుంచి శ్రీనివాసమంగాపురం వరకు టీటీడీ ఆధ్వర్యంలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ రహదారి విస్తరణలో పెరుమాళ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దళవాయి చెరువు నుంచి పేరూరు చెరువుకు వరదనీరు చేరుకునే నక్కలకాలువ, జోడి ఎద్దులవంకలను పూడ్చివేసి రోడ్డు నిర్మాణం పనులు సాగిస్తున్నారు. ఈ రహదారి విస్తరణలో సాగునీటి కాలువల నైసర్గిక స్వరూపాలను మార్చడానికి ఎలాంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా కాలువలు పూడ్చి రహదారులను నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికంగా నివాసం ఉంటున్న పెరుమాళ్లపల్లి, చందమామపల్లి, ఎస్వీ నగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు దీనిపై స్పందించి సాగునీటి కాలువను యథావిధిగా కొనసాగించాలని, రహదారి విస్తరణ చేయాల్సి వస్తే కాలువపై చిన్నపాటి పైపులు కాకుండా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరుతున్నారు. దీనిపై తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి టీటీడీతో పాటు జిల్లా స్థాయి అధికారులు అందరికీ లేఖ రాస్తామని స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురండి..

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలోని సురక్షిత మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గతంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు మరమ్మతులకు గురవడంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్న విషయం ఆయనకు తెలిసింది. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్లను పంపించారు. అయితే మిషన్లు ఏర్పాటు చేసి చాలాకాలం అయినందున మరమ్మతులకు చాలా ఖర్చు అవుతుందని.. ఆ స్థానంలో ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. దీంతో యంత్రాల మార్పు పనులు త్వరగా చేపట్టాలని ఎంపీపీ సూచించారు.

17, 18 తేదీల్లో ఆర్థిక కమిషన్ పర్యటన


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు 16వ ఆర్థిక కమిషన్ పర్యటన ఉంటుందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆ మేరకు ఆయన గురువారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలసి అధికారులతో సమావేశమయ్యారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్థిక కమిషన్ 15 మంది డెలిగేట్స్‌తో కలసి తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని, ఆ మేరకు వారికి ప్రొటోకాల్, బందోబస్తు, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవిమనోహరాచారి, జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, సీపీఓ ప్రేమచంద్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో తిరుపతి మూడవ స్థానం


కమిషనర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

తిరుపతి తుడా: రాష్ట్రంలో పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ మూడవ స్థానంలో నిలవడంతో రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ అధికారులు కమిషనర్ మౌర్యను అభినందించి జ్ఞాపికను అందించారు. గురువారం పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కమిషనర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. రాష్ట్రంలో పన్నుల వసూళ్లలో తిరుపతి మూడవ స్థానంలో నిలవడంతో ప్రత్యేక కార్యదర్శి సురేష్, సీడీఎంఏ సంపత్ కుమార్ ఈ సందర్భంగా కమిషనర్‌ను అభినందించి సన్మానించారు.

ఆత్మీయ సమావేశం


సత్కారం అందుకున్న పారంపర్య వైద్య సంఘం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ వారి పారంపర్య వైద్య సంఘం ఆత్మీయ సమావేశం గురువారం ఓ ప్రైవేటు స్కూల్లో నిర్వహించారు. ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్న 200 మందిని శ్రీసాయికళారామ్ అకాడమీ సహకారంతో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి కార్యచరణ రూపొందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఎల్క్టో హోమియోపతి డాక్టర్ నారపరెడ్డి, ఎస్వీయూ ఫార్మసిస్ట్ డాక్టర్ శుభానంద్, తమిళనాడు పారంపర్య వైద్య కార్యదర్శి డాక్టర్ సుందరం మీనాల్, దిండిగల్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నాగిరెడ్డి, వైద్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి ఆలయంలో రాత్రి 7 నుంచి 8 గంటల వరకు తెప్పోత్సవాలు. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు స్వామివారికి స్నపన తిరుమంజనం
- ఎస్వీ యూనివర్సిటీలోని సెనేట్ హాల్లో ఉదయం 9 గంటలకు రెండవ రోజు సంప్రదాయ ఔషధంపై అంతర్జాతీయ సదస్సు
- టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మహతి కళాక్షేత్రంలో జ్యోతిరావ్ పూలే 198వ జయంతి వేడుకలు
- పద్మావతిపురంలోని భూమన క్యాంపు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మీడియా సమావేశం
- నారాయణపురంలోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కామ్రేడ్ పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి వేడుకలు
- బీసీ సమరభేరిలో భాగంగా బీఎస్పీ ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన

'మేము దాడి చేయలేదు'

పాకాల: టీడీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి భర్త నంగా బాబురెడ్డిపై తాము దాడి చేయలేదని ఆ పార్టీ సీనియర్ నేత ఈశ్వర్‌చౌదరి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మట్లాడుతూ నంగా బాబురెడ్డికి తనకు మధ్య వాగ్వాదం జరిగిన విషయం నిజమేనని, పార్టీ పెద్దల జోక్యంతో వాగ్వాదం సద్దుమణిగిందని చెప్పారు. తమ పార్టీలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు జరగలేదని, ప్రచార మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నిజం కాదని తెలిపారు.

విద్యార్థులపై ఒత్తిడి చేస్తే సహించం

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్ కోసం ఫీజులు కట్టించుకుని, సంతకాలు చేయకుండా బకాయి ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తే సహించేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అక్బర్, భగత్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలకు ఫీజులు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, వెల్ఫేర్ అధికారులు స్పందించి అన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. గూడూరులో ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కూడా ప్రాజెక్ట్ వర్క్‌పై సంతకం చేయలేదనే కారణంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ క్రియాశీలక సమావేశం


మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

చంద్రగిరి: పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్వావలంబన కోసం ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. గురువారం బీజేపీ చంద్రగిరి అసెంబ్లీ క్రియాశీలక సభ్యుల సమావేశాన్ని జాతీయ రహదారి సమీపంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శులు పెనుబాల చంద్రశేఖర్, వెంకటముని పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూసేలా మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు డీఎస్పీల బదిలీ

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లాలో ఇద్దరు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర పోలీసు శాఖ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ నరసింగప్పను పెనుకొండ డీఎస్పీగా బదిలీ చేసింది. అలాగే పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న భక్తవత్సలం నాయుడును తిరుపతి డీఎస్పీగా పోస్టింగ్ ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

నిరసన

తిరుపతి అర్బన్: తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని నంబర్ వన్ ఎస్సీ హాస్టల్‌లో సరైన వసతులు లేవని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థి సంఘం నేతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. వార్డెన్ లోకనాథం రెడ్డి విద్యార్థులకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఉన్నతాధికారులు హాస్టల్‌ను పరిశీలించి, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.